సీఎం జగన్‌తోనే ఉజ్వల భవిష్యత్తు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి
వెలంపల్లి శ్రీనివాసరావు



వాంబే కాలనీలో ఎమ్మెల్యే వెలంపల్లికి హారతులు పట్టి స్వాగతం పలుకుతున్న స్థానిక మహిళలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద ప్రజలకు మెరుగైన జీవన విధానాన్ని అందించడమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేసిందని.. మనకు, మన బిడ్డలకు మరింత ఉజ్వల భవిష్యత్తు లభించాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్న వస్తేనే అది సాధ్యపడుతుందని ఆ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 60వ డివిజన్ వాంబే కాలనీలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి ఎంపీగా కేశినేని నాని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని వెలంపల్లి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు అధికంగా జీవిస్తున్న వాంబేకాలనీలో కేవలం ఎన్నికల సమయంలో తప్ప మిగిలిన రోజుల్లో ఏ ప్రభుత్వానికి ఈ కాలనీ గుర్తుకువచ్చేది కాదని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాంబేకాలనీలో అంతర్గత రోడ్లు, మౌలిక వసతుల కల్పనతో పాటు కాలనీ ప్రజల చిరకాల కోరిక అయిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లను సాకారం చేసి చూపారన్నారు. ప్రధానంగా వాంబేకాలనీ ప్రాంత ప్రజలను దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న డంపింగ్ యార్డ్‌ను తరలించి, అత్యాధునిక వసతులతో ఇక్కడ ఐకానిక్ పార్కులు నిర్మిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని పేర్కొన్నారు.

మేనిఫెస్టోలో చెప్పిన
ప్రతి పథకం మళ్లీ అందిస్తాం..

వైఎస్సార్ సీపీ నూతనంగా ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో నిరుపేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే వెలంపల్లి అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ మేనిఫెస్టోను తప్పనిసరిగా చదవాలని సూచించారు. మేనిఫెస్టోను ఒక భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి ఇచ్చిన ప్రతి హామీని అమలుచేసి చూపిన ఏకైక సీఎం జగనన్నే అని చెప్పారు. ఈ మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని రానున్న మన ప్రభుత్వంలో జగనన్న తప్పక అందిస్తారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడే వైఎస్సార్ సీపీకి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. ప్రచారంలో స్థానిక మహిళలు, పలు పథకాల లబ్ధిదారులు అడుగడుగున వెలంపల్లికి హారతులు పట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ షేక్ ఖాజా, కోఆప్షన్ సభ్యుడు ఆలీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు బెవర నారాయణ, బత్తుల దుర్గారావు, ఎండీ ఇస్మాయేల్, మూర్తి, వెలంపల్లి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేర ప్రవృత్తి వీడాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): నేరస్తులు, రౌడీషీటర్లు నేర ప్రవృత్తి వీడాలని గుణదల పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ వెంకట్రావు సూచించారు. స్థానిక గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నేరస్తులు, రౌడీషీటర్‌లకు కౌన్సిలింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నామని చెప్పారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లపై పోలీసుల నిరంతర నిఘా కొనసాగుతుందని నేరం చేసిన వారు తప్పించుకోలేరని పేర్కొన్నారు. ఎక్కడైనా నేరం జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి కుంకుమ పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీ చక్రార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

విరసం ఆధ్వర్యంలో పుస్తక ఆవిష్కరణ



విజయవాడకల్చరల్: విప్లవ రచయితల సంఘం విజయవాడ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుల సంఘం భవన్‌లో దేశం కార్పొరేట్లకు (కగార్ యుద్ధంలో హిందూత్వ ఫాసిస్ట్ వ్యూహం) పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభకు విరసం సీనియర్ నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్తులను అదాని, అంబానీలకు అప్పజెప్పడానికి బీజేపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసులపై యుద్ధం ప్రకటించినట్లు తెలిపారు. ప్రజల కోసం కాక కార్పొరేట్ల కోసం పనిచేస్తున్నట్లు చెప్పారు. సిద్దార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌బాబు ఎన్నికల బాండ్లు–ప్రజాస్వామ్యం అంశంగా మాట్లాడుతూ ఎన్నికల బాండ్లలో పారదర్శకత లేకుండా చేశారన్నారు. దేశంలోని నాలుగు ప్రధాన పార్టీలకు బాండ్లు అందినట్లు గుర్తు చేశారు. విరసం సభ్యుడు యుగంధర్ వందన సమర్పణ చేశారు. విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద, పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయాల్లో సోమవారం నుంచి జూన్ ఏడో తేదీ వరకూ వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారులు కె.జ్యోతి, కె.కృపానందం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. విద్యార్థులకు వేసవి విరామాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఈ శిబిరాల్లో కథలు చెప్పించడం, పుస్తకాలు చదివించడం, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు. దీంతో వారిలోని సృజనకు పదును పెట్టినట్లు అవుతుందని వివరించారు. విద్యార్థులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోండి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నామని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణ తెలిపారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయవాడ రూరల్ ప్రాంతాలైన షాబాద్, జక్కంపూడి గ్రామాల్లో ఆదివారం పోలీసులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణ పర్యవేక్షణలో సీఐ గణేష్ ఆయా ప్రాంతాల్లో కేంద్ర అదనపు బలగాలు, పోలీసులు, సిబ్బందితో కవాతు నిర్వహించారు. శాంతియుత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని, సంఘ విద్రోహ శక్తుల ఆటలను ప్రజల సహకారంతోనే అరికట్టేలా ఈ కవాతు నిర్వహించామన్నారు. ఎన్నికల తరుణంలో ఎటువంటి ఇబ్బందులను ప్రజలు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

రాష్ట్రానికి దిక్సూచి వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి
ఆకుల శ్రీనివాస్ కుమార్


వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో కాపీలను ఆవిష్కరిస్తున్న ఆకుల శ్రీనివాస్‌కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో రాష్ట్రానికి దిక్సూచి వంటిదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్‌కుమార్ అన్నారు. విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మేనిఫెస్టో కాపీలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ చెప్పారంటే.. చేస్తారంతే.. అన్న నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి నూరు శాతం అమలు చేసిన ఏకైక పార్టీగా వైఎస్సార్ సీపీ దేశంలోనే గుర్తింపు పొందిందన్నారు. అమలు చేయగలిగిన హామీలనే సీఎం జగన్ ప్రకటించారన్నారు. సీఎం జగనన్న పథకాల వల్ల ఏపీ శ్రీలంకలా మారిపోతుందన్న చంద్రబాబు, అవే పథకాలను కాపీ కొట్టి సూపర్ సిక్స్ పేరుతో ప్రజల్లోకి వెళ్లడం సిగ్గుచేటన్నారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఐటీ రంగంలో సవాళ్లను ఎదుర్కోవాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఐటీ రంగంలో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే స్కిల్స్‌ను విద్యార్థులు పెంపొందించుకోవాలని మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లోని ఆర్కిటెక్ట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ ఉడతా అన్నారు. నలంద డిగ్రీ కళాశాలలో 2023–24వ సంవత్సరంలో 223 మంది ప్లేస్‌మెంట్స్ సాధించినందుకు గాను ఆదివారం సక్సెస్‌మీట్ –2024 నిర్వహించారు. బెంజిసర్కిల్ సమీపంలోని నలంద విద్యానికేతన్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ మీట్‌లో రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు, ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ముస్లిం విద్యార్థులకు వేసవి తరగతులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ డిస్పెన్సరీ మూడవ రోడ్డులోని మదరస దావతుల్ ఖుర్ఆన్ ఇమారత్–ఎ–షర్ ఇయ్యహ్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి మే 31 వరకు ఏలాన్ దాఖిలా వేసవి తరగతులు నిర్వహిస్తున్నట్లు మసీద్ గురువు రహీం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో సిలబస్‌లు ఖుర్ఆన్ సూరతే తజ్‌వీదొ సాద్, అహాదీస్, జరూరీ మసాయిల్, సీరతున్నబీ, మున్‌నూన్‌దుఆయే, రోజానాకీసున్నతే, సమాజ్‌కాతరీకాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఒకటి నుంచి 10వ తరగతిలోపు విద్యార్థులు హాజరై ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం


ఠాగూర్ గ్రంథాలయంలో యోగ శిక్షణ ఇస్తున్న ప్రభాకర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగ గురువు ప్రభాకర్ అన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో స్ఫూర్తి కుటుంబం, ఆంధ్రప్రదేశ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం యోగ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వస్ఫూర్తి గురువులు అనుగ్రహించిన 'ఆసన ప్రాణాయామ యోగ ప్రక్రియ' (ప్రస్థాన సాధన)లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. నిరంతరం యోగ సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. రిటైర్డ్ రైల్వే కళాశాల అధ్యాపకులు కాదంబరి జ్యోతి 'మనసే అన్నింటికీ మూలం' అని మనసును అదుపులో పెట్టుకోవాలని సూచించారు. మనసుపై నియంత్రణతో శ్రేయస్కర జీవితం గడపవచ్చన్నారు. శిక్షణలో 33 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి కుటుంబం ఏపీ ట్రస్టీ చొప్పరపు నారాయణరావు, గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి, గుణశేఖర్, వలంటీర్లు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు సాయినగర్‌కు చెందిన అర్షియాబేగం 2018వ సంవత్సరంలో హైదరాబాద్‌కు చెందిన షేక్ అహ్మద్‌షాను వివాహం చేసుకుంది. భార్యభర్తలకు మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నారు. కాగా 2023వ సంవత్సరం అక్టోబర్ నెలలో కొండపల్లికి చెందిన రఫీవుద్దీన్‌ను కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. వీరు హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. కాగా భర్త అదనపు కట్నం తీసుకురమ్మని వేధించసాగాడు. పైగా అతను అప్పటికే మూడు వివాహాలు చేసుకొని భార్యలను వదిలేశాడు. అదనపు కట్నం తీసుకురాలేదని భార్యపై దాడి చేసేవాడు. భర్తతో పాటు అత్త షమీమ్, మామ షేక్ మొహిద్దీన్ వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో అత్తింటివారిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

సంక్షేమ ప్రభుత్వానికి ఓటు వేయండి


జేబీఆర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న మాజీ డెప్యూటీ మేయర్ వెంకటరమణారావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని సంక్షేమ ప్రభుత్వానికి ఓటు వేసి విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని మాజీ డెప్యూటీ మేయర్ గోగుల వెంకట రమణారావు కోరారు. స్థానిక 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్ ట్రెండ్‌సెట్‌లో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట రమణారావు గడప గడపకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే జగనన్న ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు. అవకాశవాద టీడీపీ కూటమిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ఫణి శ్రీనివాస్‌కు లీడర్ షిప్ అవార్డు

గన్నవరం రూరల్: మండలంలోని మాదలవారిగూడెం లింగయాస్ ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న ప్రొఫెసర్ ఫణి శ్రీనివాస్‌కు అవుట్ స్టాండింగ్ రీసెర్చ్ అండ్ లీడర్ షిప్ అవార్డు వరించింది. ఈ మేరకు ఆయన చేసిన ప్రయోగాలు, రీసెర్చ్ పేపర్‌లు, ప్రజెంటేషన్ స్కిల్స్, అడ్మినిస్ట్రేటివ్ నాలెడ్జ్‌ని గుర్తించిన సైంటిస్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్రెస్ ప్రముఖులు మద్రాస్ ఐఐటీలో ఈ పురస్కారం అందజేశారు. కళాశాల చైర్మన్ గద్దె రాజలింగ్, ప్రిన్సిపాల్ రవీంద్ర కృష్ణ, అధ్యాపకులు ఫణి శ్రీనివాస్‌ను అభినందించారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు


క్యూలైన్‌లో పొంగళ్లతో భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలుపొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎండ తీవ్రత తట్టుకోలేక భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఆలయ అధికారులు, గుంటూరుకు చెందిన యలమంచలి అభిరామ్ సౌజన్యంతో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

స్వచ్ఛమైన వేద విద్య అందిస్తున్నాం


బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాంధాత

పటమట(విజయవాడతూర్పు): కంచి కామకోటి పీఠం ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో స్వచ్ఛమైన వేద విద్యను అందిస్తున్నామని, కోర్సుల్లో చేరాలనుకునే వారు మధ్యవర్తులెవరికీ ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, అర్హత ఆధారంగానే కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తామని కంచి కామకోటి పీఠం ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఇన్‌చార్జి లక్ష్మీ మాంధాత తెలిపారు. ఆదివారం లబ్బీపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మీ మాంధాత మాట్లాడుతూ కంచి కామకోటి పీఠం సంప్రదాయ పాఠశాలల నుంచి డొనేషన్లు తీసుకుంటున్నారనే దుష్ప్రచారాన్ని ఖండించారు. తాము ఎలాంటి డొనేషన్లు తీసుకోవడం లేదని, స్వచ్ఛమైన వేద విద్యను అందుబాటులోకి తీసుకొచ్చామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బ్రోచర్లను ఆవిష్కరించారు. విలేకరుల సమావేశంలో విజయవాడ శాఖ ఇన్‌చార్జి విష్ణుభట్ల పద్మావతి, వలంటీర్ శ్రీరామ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలంటూ ప్రచారం


బొట్టుపెట్టి ఓట్లు అభ్యర్థిస్తున్న భవానీరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 27వ డివిజన్ గులాబీతోటలో ఆదివారం సిద్ధం శీనన్న సైనికుల కమిటీ ఆధ్వర్యాన వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలంటూ వినూత్న ప్రచారం ప్రారంభించారు. శీనన్న సైనికుల కమిటీ ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగనన్న ప్రవేశపెట్టిన ప్రజా మ్యానిఫెస్టో సంక్షేమ పథకాలను వివరించారు. గడప గడపకు వెళ్లి బొట్టు పెట్టి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులు వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నానిలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శీనన్న సైనికుల కమిటీ సభ్యులు కురిటి శివ, శీలం భవానీరెడ్డి, యర్రంశెట్టి శ్రీను మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రతిపక్షాలు ఈర్ష్యపడేలా పారదర్శక పాలన సాగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నాని గెలుపు కోసం తాము స్వచ్ఛందంగా సిద్ధం శీనన్న సైనికుల కమిటీ ఏర్పాటు చేసుకుని ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లంకా కుమార్, కాటూరి కృష్ణ, కనక లింగేశ్వరరావు, పురమా శ్రీధర్, వెంకటేశ్వరరావు, చందు, దుర్గారావు, అప్పారావు, కాజా, గులాబీతోట వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మండా రాము, పసుపులేటి ఏసు, కుంభ రవి, మదీనా, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌంటర్లలో ఈఓ ఆకస్మిక తనిఖీలు


ప్రసాదాల విక్రయ కౌంటర్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈఓ రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఈఓ కేఎస్ రామరావు ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మహామండపం గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్రసాదాల విక్రయ కౌంటర్లతో పాటు ఏడో అంతస్తులోని మైక్ ప్రచార కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ప్రసాద విక్రయ కౌంటర్లను తనిఖీ చేసిన క్రమంలో రోజు వారీ విక్రయాలు, ప్రసాదం స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ప్రసాదాల కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులతో మాట్లాడిన ఈఓ ఆలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అమ్మవారి ప్రసాదమైన పులిహోర ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం మైక్ ప్రచార కేంద్రానికి చేరుకుని సిబ్బందితో మాట్లాడారు. ఆలయంలో జరుగుతున్న నిత్యసేవలతో పాటు అన్నప్రసాదం, మల్లేశ్వరస్వామివారి దర్శనంతో పాటు అమ్మవారి ఆలయానికి జరిగే బంగారు తాపడం పనుల గురించి భక్తులకు తెలియజేయాలని సూచించారు.

చిన్నారి వైద్య ఖర్చులకు దీవెన ఫౌండేషన్ సాయం


చిన్నారి తల్లికి సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యుడు భీమరాజు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రమాదవశాత్తు మెట్ల మీద నుంచి జారి పడిపోయి నడుము విరిగి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఏడాదిన్నర వయసుగల చిన్నారి అంకిత్ వైద్య ఖర్చుల నిమిత్తం దీవెన ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందజేసింది. విజయవాడ మధురానగర్‌కు చెందిన నరేష్, పావని దంపతులు ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వారి కుమారుడు చిన్నారి అంకిత్‌కు అనుకోకుండా జరిగిన ప్రమాదానికి నిరుపేదలైన తల్లిదండ్రులు తల్లడిల్లి పోయారు. కుటుంబాన్ని పోషించుకోవడమే అంతంత మాత్రంగా ఉన్న తరుణంలో ఈ ప్రమాదాన్ని వారు తట్టుకోలేకపోయారు. కొడుకు అంకిత్‌ను నగరంలోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్‌కు తీసుకువెళ్లి తమ శక్తికి మించి ఖర్చు చేశారు. అయినా ఫలితం కనబడకపోవడంతో చివరికి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారు దీవెన ఫౌండేషన్ సభ్యులను సహాయం కోసం ఆశ్రయించారు. దీంతో ఫౌండేషన్ సభ్యుడు కానిస్టేబుల్ భీమరాజు ఆదివారం ఆస్పత్రికి వెళ్లి రూ. 15,500 నగదు అందజేశారు. ఫౌండేషన్ సభ్యులకు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

నర్సింగ్ వృత్తి పవిత్రమైనది



మాట్లాడుతున్న డాక్టర్ కె.శివశంకరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అతి పవిత్రమైనది నర్సింగ్ వృత్తి అని అటువంటి వృత్తిని ఎంచుకోవడం అభినందనీయమని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కె.శివశంకరరావు అన్నారు. స్థానిక దుర్గాపురం విమ్స్ మదర్ థెరిస్సా నర్సింగ్ కళాశాలలో ఆదివారం సాయంత్రం బీఎస్సీ నర్సింగ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులు సేవాభావంతో సేవలు అందించాలని సూచించారు. అనారోగ్యంతో వచ్చిన ప్రతి ఒక్కరికీ స్వాంతన చేకూర్చేందుకు కృషి చేయాలని అన్నారు. డాక్టర్ పీ రామకృష్ణ మాట్లాడుతూ వైద్య సేవల్లో నర్సింగ్ పాత్ర ఎనలేనిదని అన్నారు. విజయ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ చైర్మన్ తట్టి అర్జునరావు మాట్లాడుతూ మదర్ థెరిస్సా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సేవలు అందించాలని కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ టీ శ్రీకాంత్ మాట్లాడారు. అనంతరం నర్సింగ్ పూర్తిచేసిన విద్యార్థులకు పట్టాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో కే జాన్సన్, రాజేష్ ఆర్ పిలెల్ల, పాస్టర్ ఎం.జాబ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలి


30వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల అభ్యున్నతే పరమావధిగా పారదర్శక పాలన సాగించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని 30వ డివిజన్ కార్పొరేటర్ టీ హెచ్ఎస్‌వీ జానారెడ్డి కోరారు. స్థానిక 30వ డివిజన్ విజయదుర్గానగర్‌లో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన సేవలను వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

28వ డివిజన్‌లో..

స్థానిక 28వ డివిజన్ భానునగర్‌లో డివిజన్ ఇన్‌చార్జి కసపర్తి కొండలరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వేదాంతం చైతన్య, పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్ సీపీకి ఓటు వేయాల్సిన అవశ్యకతను వివరించారు. 'ఫ్యాను గుర్తుకు ఓటు.. భవితకు ఓటు.. అని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.